క్లుప్తంగా

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రేపు

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిష్టినా జన్మదినాన్ని పురస్కరించుకుని మాస్ సంస్థ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భాగ్యరాజు, గొరికపూడి బాలరాజు, ఎ.రవీంద్ర, కోట్ల దిలీప్, తాతపూడి శ్రీధర్, చిలువూరి రవి, తదితరులు పాల్గొన్నారు. నల్లగండ్ల పెద్ద రంగయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక పట్టణ ఉపాధ్యక్షుడు నల్లగండ్ల రవిచంద్ర ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఏల్చూరి అమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్, మండల అధ్యక్షుడు కుర్రా జశ్వంత్, నాయకులు ఉన్నవ సల్మాన్, బత్తుల బాలగోపి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా పురస్కారం నేడు

తెనాలి: తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జన్మదినోత్సవం జరుపనున్నారు. తెలుగు భాషా ఉపాధ్యాయుడు వెలగా సుభాష్ చంద్రబోస్ను భాషా పురస్కారంతో సత్కరించనున్నట్లు సమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

యర్రబాలెంలో చోరీ

యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన వెలుగు చూసింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్రబాలెంలోని నోరివారి వీధికి చెందిన ఫణి శ్రీరామ్ చిట్స్లో పని చేస్తుంటాడు. బుధవారం వినాయకచవితి కావడంతో విజయవాడలోని తల్లితండ్రుల వద్దకు భార్యతో కలిసి వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తాళాలు పగలగొట్టి ఉండడంతో పాటు బయట ఉన్న ద్విచక్ర వాహనం కనిపించలేదు. లోపలికి వెళ్లి చూడగా దేవుడు గదిలోని రెండు వెండి దీపపు కుందులు, హ్యాండ్ బ్యాగ్లోని రూ.15 వేల నగదు చోరీకి గురయ్యాయని గుర్తించి ఫణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా యర్రబాలెంలో వారంలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తుంది. నోరివారి వీధిలో నివాసముంటున్న ఫణి ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. కాగా ఇటీవల తాడేకోరు రమేష్బాబు నివాసం ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం, జానకీ అమ్మవారి ఆలయ ప్రాంతానికి చెందిన మల్లేష్ వాహనం చోరీకి గురయ్యాయి. దీంతో స్థానికులలో భయాందోళన నెలకొంది. పోలీసుల నిఘా కొరవడడం, రాత్రి వేళల్లో గస్తీ తిరగకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వేములూరిపాడు విద్యార్థులు



ఫిరంగిపురం: శారీరక మానసిక వికాసానికి ఆటలు ఎంతో దోహదం చేస్తాయని పాఠశాల హెచ్ఎం ఎల్.సాంబయ్య అన్నారు. గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో వేములూరిపాడు జిల్లా పరిషత్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ లభించాయి. పాఠశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొనగా, నలుగురు బాలురు, ముగ్గురు బాలికలకు టీం గేమ్లో గోల్డ్ మెడల్స్ రాగా, సమీనా, షేక్, అబ్దుల్ గనిలకు వ్యక్తిగత బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ లభించాయన్నారు. వీరిరువురు ఈ నెల 30, 31న నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథునికి నృత్య నీరాజనం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్ 9వ లైనులో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అనూ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య పదర్శన ఆకట్టుకుంది. చిన్నారుల బృందం సంప్రదాయ నృత్యాలతో గణనాథునికి నృత్య నీరాజనం సమర్పించారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా

- వాడవాడలా గణనాథునికి పూజలు
- కనులవిందుగా విగ్రహాలు, ప్రత్యేక అలంకరణ
- విద్యుత్ కాంతులతో గణేష్ మందిరాలు

వినాయక చవితి వేడుకలను భక్తులు అట్టహాసంగా నిర్వహించారు. ఇంటింటా గణపతిని పత్రి, పూలు, పండ్లతో శక్తిమేర కొలుచుకున్నారు. పిండివంటలను చేసుకుని ఇంటిల్లిపాది సంతోషంగా గడిపారు. కూడలి ప్రాంతాల్లో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన గణపతి పందిళ్లు ఆకర్షణీయంగా నిలిచాయి. పర్యావరణ ప్రేమికులు మట్టి ప్రతిమలను ఉపయోగించి తమ భక్తి ప్రవర్తులను చాటుకున్నారు.

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భాస్కరుని శ్రీనివాసరావు, నంబూరు నరేంద్ర ఆధ్వర్యంలో జరిగిన చవితి వేడుకల్లో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. డబుల్హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు వేడుకల్లో అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. పుట్టా రాఘవయ్య రైస్ మిల్లు వద్ద మున్సిపల్ మాజీ వైస్చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 18వ సంవత్సరం శ్రీగణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, శ్రీగణేష్ భక్త బృందం ముత్యంశెట్టి గోపాలరావు, శ్రీను, కొండయ్య, కాసంశెట్టి బాలాజీ, శివయ్య, మదెంపూడి నాగరాజు, చింతల గోపి, గురివిశెట్టి శ్రీను, నాగులు పాల్గొన్నారు. మారీసుపేటలో చిన్నారి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలోని వేడుకల్లో మార్కెట్యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రజకచెరువు వద్ద సాయిరామ్ యూత్ ఆధ్వర్యంలో, పూర్ణ నిర్వహణలో జరిగిన వేడుకల్లో ఏర్పాటుచేసిన వినాయకుడు, ఆంజనేయుడు విగ్రహాలు ఆకర్షణీయంగా నిలిచాయి.

కొల్లిపర: వినాయక చవితి వేడుకలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు, కొల్లిపర, చక్రాయపాలెం గ్రామాల్లో పలు కమిటీల వారు ఏకదంతునికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, మునగాల శ్యాంప్రసాద్, భాస్కరుని శ్రీనివాసరావు



11వ వార్డు గణపతి ఉత్సవాల్లో చైర్పర్సన్ రాధిక



రజకచెరువు ఉత్సవాల్లో గణపతి, ఆంజనేయుడు

తెనాలి: పట్టణ నాజరుపేట 9వ వార్డులో లక్ష్మీ నగర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో అష్టమ వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక–రమేష్ దంపతులు హాజరయ్యారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు తీసుకున్నారు. స్థానిక అయితానగర్లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు సమీపంలో కామేపల్లి లక్ష్మయ్య ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నవితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



తూములూరులో ఏర్పాటు చేసిన గణపయ్య



ఒకటో వార్డు ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు..



నృత్యం చేస్తున్న చిన్నారులు

తెనాలి అర్బన్: పద్మశాలీ యూత్ ఆధ్వర్యంలో ప్రగడకోటయ్య నగర్లో వినాయక చవితి మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ నిర్వాహకుడు పెసర్లంక గోపి, వసంత దుర్గ శిష్య బృందం వారు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



పట్టణ ఆంజనేయపంతులు వీధిలో..



బాలాజీరావుపేటలో పూజలు..

ప్రజల ఆర్థిక అవసరాలకు తోడ్పాటునివ్వాలి

ఆర్బీఐ జనరల్ మేనేజర్ ఆర్కే మహాన



బ్రాంచ్ను ప్రారంభిస్తున్న ఆర్కే మహాన

తెనాలి: ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ 57వ శాఖను గురువారం స్థానిక కొత్తపేటలోని మొటుపల్లి వారి వీధిలో ఆరంభమైంది. భారతీయ రిజర్వు బ్యాంక్, ఆంధ్ర ప్రదేశ్ జనరల్ మేనేజరు ఆర్కే మహాన ముఖ్యఅతిథిగా హాజరై, నూతన శాఖను ప్రారంభించారు. అనంతరం సమీపంలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన సభకు ఆ బ్యాంక్ చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఆర్బీఐ జనరల్ మేనేజరు మహాన మాట్లాడుతూ.. కొత్తగా బ్యాంకు శాఖ ఏర్పడితే ప్రజల ఆర్థిక అవసరాలకు ఉపకరిస్తుందని చెప్పారు. సహకార ఉద్యమ ప్రముఖుడు మానం ఆంజనేయులు తన ప్రసంగంలో సమష్టి కృషితోనే ది విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ రూ.8 వేల కోట్ల వ్యాపారానికి ఎదిగిందన్నారు. 'నాఫ్కాబ్' డైరెక్టర్, బ్యాంక్ వైస్చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. సామాన్యులు, రైతులు, చిరువ్యాపారులతో సహా అందరికీ రుణాలనిస్తూ వారి జీవన ప్రమాణాల పెంపునకు సహకార రంగంపైనే ఎక్కువ బాధ్యత ఉందన్నారు. బ్యాంక్ చైర్మన్ సత్యనారాయణమూర్తి తన ప్రసంగంలో సహకార సూత్రాల ప్రాతిపదికగా ఆర్బీఐ నిబంధనలను పాటిస్తూ సామాన్యుల స్థితిగతుల మెరుగుదలకు కృషిచేస్తున్న ది విశాఖ సహకార బ్యాంక్ను వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ రూ.కోటి, తెనాలిలోని కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ రూ.25 లక్షలను డిపాజిట్లుగా చైర్మన్కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, వివిధ సొసైటీల చైర్మన్లు ఎల్లారావు, రంగరాజు, డీఎల్ కాంతారావు, ఎం.హరిప్రసాద్, విశాఖ బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా పోరాడాలి



ప్రమాణం చేయిస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి: విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో గురువారం ఆయన స్థానికులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్లోని బషీర్బాగ్లో 25 ఏళ్ల క్రితం జరిగిన విద్యుత్ పోరాటంలో ముగ్గురు వామపక్ష కార్యకర్తలను అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బలి తీసుకుందని గుర్తుచేశారు. ఆ ఉద్యమం ఫలితంగా కొన్నేళ్లు విద్యుత్ ఛార్జీలు పెరగలేదని తెలిపారు. గత 14 నెలల కాలంలో రూ.15,485 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని వినియోగదారులపై మోపారని చెప్పారు. దీంతో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు రద్దవుతాయని వివరించారు. 2019–24 సంవత్సరాలలో వినియోగించుకున్న విద్యుత్పై మరో రూ.12.717 కోట్ల ట్రూ అప్ ఛార్జింగ్ భారం వేయడానికి రంగం సిద్ధమైందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, బండి లెనిన్ బాబు, కర్రే మోషే, దేశ బోయిన కోటేశ్వరరావు, అంచే మాధవరావు, వెంకటసుబ్బయ్య, కసుకుర్తి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తెనాలి: పట్టణ మారీసుపేటలోని ఎరువుల షాపులపై అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలను చేపట్టారు. ఎరువుల దుకాణాల్లోని స్టాక్ను, గోడౌన్లలోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. త్రీ టౌన్ సీఐ సురేష్బాబు మాట్లాడుతూ.. వ్యాపారులు ఎవరైనా ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరకన్నా ఎక్కువగా అమ్మితే వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మండల వ్యవసాయాధికారి కె.సుధీర్బాబు ఎరువులను అధిక ధరలకు అమ్మినట్లు తెలిస్తే సంబంధిత వ్యాపారి లైసెన్సును రద్దు చేయనున్నట్లు చెప్పారు.

రోడ్డుపై గుంతలు.. తప్పని తిప్పలు



మాతాశ్రీ ఆశ్రమం ఎదురుగా గోతుల మయంగా ఉన్న రహదారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట మాతాశ్రీ ఆశ్రమం ఎదురుగా ఉన్న రహదారి నుంచి కొలనుకొండ వరకు పలుచోట్ల గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు మొత్తం గోతులమయం కావడంతో గురువారం తల్లితో స్కూల్కు వెళుతున్న చిన్నారులకు ఆ గోతుల వల్ల గాయాలయ్యాయి. మాతాశ్రీ ఆశ్రమం దగ్గర నుంచి రైల్వే గేటు వరకు విపరీతంగా గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలు కురియడంతో ఆ గోతుల్లో నీళ్లు నిలిచాయి. దీంతో వాహన చోదకులు గొయ్యి లోతు తెలియక వాటిల్లో పడి గాయాల పాలవుతున్నారు. బ్రహ్మానందపురం నుంచి ద్విచక్ర వాహనంపై తల్లితో కలసి వస్తున్న చిన్నారులకు కూడా ఇలాగే ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కాగా, దుస్తులు బురదమయమయ్యాయి. కాళ్లకు, చేతులకు డోకుడు గాయాలు అయ్యాయి. ఉండవల్లి సెంటర్లో ట్రాఫిక్ మళ్లించినప్పుడల్లా ఈ రహదారిలో అధిక బరువుతో లారీలు ప్రయాణించడంతో ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఇదే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు అంటున్నారు. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు నిలిపివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సెల్ఫోన్ల దొంగలు అరెస్ట్

మంగళగిరి: కేటీఎం బైక్లపై వచ్చి మాట్లాడుతున్న సెల్ఫోన్లు లాక్కుపోయే ఇరువురు దొంగలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ గురువారం తెలిపిన వివరాల మేరకు చెడు వ్యసనాలకు బానిసలైన మంగళగిరి పట్టణానికి చెందిన మహేష్, తాడేపల్లికి చెందిన మరో బాలుడు ఇద్దరు బైక్పై వచ్చి ఎవరైనా రోడ్డు మీద మాట్లాడుతూ ఆదమరిస్తే ఫోన్ లాక్కుని దిచక్ర వాహనంపై పారిపోయి వాటిని విక్రయించి జల్సాలు చేస్తుంటారు. ఈ నెల 25న మల్లేపల్లి మునుస్వామితో మరో ఇరువురు గుంటూరు నుంచి ఆటోలో వినాయక విగ్రహానికి తీసుకువస్తుండగా మునుస్వామి ఆటో డ్రైవర్ పక్కన కూర్చుని మాట్లాడుతుండగా ఎన్ఆర్ఐ ఆసుపత్రి వద్ద మునుస్వామి ఫోన్లాక్కుని పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి మహేష్తో పాటు అతని స్నేహితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చూడాలి



తెనాలి అర్బన్: వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చూడాలని మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 10, 11వ వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా 2వ కార్యక్రమాన్ని గురువారం స్థానిక కొత్తపేటలోని శ్రీరావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలులో నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. అనంతరం నేత్ర సంరక్షణ, నేత్రదానంపై వారికి అవగాహన కల్పించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ పి.భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.భారతి.. విజ్ఞాన వేదిక తరఫున ఉప్పల సాంబశివరావు, నందూరి నారాయణరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. సదస్సు అనంతరం ప్రధానోపాధ్యాయిని భారతిని విజ్ఞాన వేదిక ప్రతినిధులు సత్కరించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

తెనాలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన

తెనాలి అర్బన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ నాయకులు కె.బి.ప్రసాద్ తెలిపారు. బషీర్బగ్ కాల్పుల ఘటనలో అసువులుబాసిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని గురువారం తెనాలిలో నిర్వహించారు. అనంతరం మార్కెట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 28న 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా నిర్వహించిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై విచక్షణా రహితంగా పోలీసులు కాల్పులు జరిపారని గుర్తు చేశారు. ముగ్గురు కార్యకర్తలు అసువులుబాసినట్లు చెప్పారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్వలీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని, పోరాటలకు సిద్ధం కావాలని కోరారు. నాయకులు పి.నాగరాజు, మంగళగిరి పద్మ, మహమ్మద్ ముస్తాఫా, ఎం.ఆదినారాయణ, ఎస్.సుబ్రహ్మణ్యం, కె.దుర్గాప్రసాద్, పి.రాజశేఖర్, కె.ప్రకాష్బాబు, సీహెచ్.శేషగిరిరావు, కె.పిచ్చమ్మ, ఎం.వెంకన్న, డి.శ్రీధర్, టి.రంగయ్య, కృష్ణ, కరిముల్లా, వాసు గోపి, దార్ల పద్మ, రెడ్డి స్వామమ్మ, వి.సంజీవి, శారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో మెరిసిన తెనాలి చిన్నారులు!



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో తెనాలి చిన్నారులు నర్తించారు. బ్రహ్మోత్సవాల రెండోరోజైన గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై తెనాలికి చెందిన శ్రీకల్యాణి ఆర్ట్స్ అకాడమీ నృత్య గురువు డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి శిష్య బృందం పలు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ఆహుతుల ప్రశంసలను అందుకున్నారు. దేవస్థానం అధికారులు వీరికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలను బహూకరించారు. – తెనాలి

మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మీనా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో గురువారం మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ మీనా మాట్లాడుతూ జీవితంలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న పరీక్ష ఒత్తిడి సమస్య, ఆందోళన, నిద్రా భంగం వంటి సమస్యలపై విద్యార్థులకు సూచనలు చేశారు. ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసంతో ఉన్నతంగా ఎదుగుతారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.